ప్రజాశక్తి

సోమవారం 14 జులై 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఆగని రేషన్ అక్రమ వ్యాపారం

- ఎండియు వాహనాలను రద్దు చేసినా ప్రయోజనం శూన్యం
- మాఫియాతో పౌరసరఫరాల డిటిలు, రెవెన్యూ అధికారుల కుమ్మక్కు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గత ప్రభుత్వంలో రేషన్ సరఫరాలో అక్రమాలు జరిగాయని, పేదలకివాల్సిన బియ్యం పలు రాష్ట్రాలకు అక్రమంగా ఎగుమతి అవుతున్నాయని చెబుతూ ఎండియు వాహనాలను రద్దు చేశారు. డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నా మెరుగైన ఫలితాలు రావడం లేదు. రేషన్ బియ్యం బదులు కార్డు దారులకు గతంలో మాదిరిగానే ప్రజలకు బియ్యంకు బదులు సొమ్ములు ఇస్తున్నారు. డీలర్లు కూడా రేషన్ మాఫియాకు సహకరిస్తున్నా నియంత్రించాల్సిన పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్లు, విఆర్వోలు, విజిలెన్సు విభాగం ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. ప్రజల నుంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందితే ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు అడపాదడపా దాడులు నిర్వహిస్తున్నారు. వాహనాల స్థానంలో 2020కి ముందు ఉన్నట్టుగానే డీలర్ల ద్వారానే గత నెల ఒకటో తేదీ నుంచి రేషన్ పంపిణీ పున: ప్రారంభించారు. రెండు జిల్లాల పరిధిలో గత 40 రోజుల్లో పలు అక్రమాలు వెలుగుచూశాయి. డీలర్ల వద్ద నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఇప్పటికే పలు ప్రాంతాల్లో అధికారులు పట్టుకున్నారు. డీలర్లు పాత పద్ధతిలోనే బియ్యం బదులు వినియోగదారులకు కిలో రూ.10 నుంచి రూ.12 వరకు సొమ్ములు ఇస్తున్నారు. డీలర్ల వద్ద అక్రమంగా బియ్యం కొనుగోలు చేసే మాఫియా బృందాలు గతంలో మాదిరిగానే తమ పంథాను కొనసాగిస్తున్నారు. గత నాలుగుఏళ్ల నుంచి వాహనదారుల నుంచి బియ్యం కొనుగోలు చేయడంలో కీలక భూమిక పోషించిన మాఫియా మళ్లీ పాతపద్ధతిలోనే డీలర్ల నుంచి బియ్యం సేకరణ చేస్తున్నారు. డీలర్ల ద్వారానే రేషన్ బియ్యం తీసుకుని ఇతర రాష్ట్రాలకు పంపే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ప్రధానంగా క్షేత్రస్థాయి అధికారులు ఎక్కువ మంది జిల్లాలో రేషన్ అక్రమాలను ఏమాత్రం పట్టించుకోకుండా డీలర్ల వద్ద నుంచి మామూళ్లతో ఒప్పందాలు చేసుకుంటున్నారని తెలిసింది. పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ తనకు వచ్చిన సమాచారం ప్రకారం నాదెండ్ల మండలం చిరుమామిళ్లలో ఆకస్మిక తనిఖీలు చేయించారు. చిరుమామిళ్ల అంజిరెడ్డి అనే అతను అక్రమంగా పేదవారికి చెందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఆటోలో

2లో

గుంటూరు సమ్మె శిబిరంలో ప్రసంగిస్తున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె సైరన్

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల నిరసన - గుంటూరులో 15 మంది కార్మికులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మె ప్రారంభం అయ్యింది. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జి.ఓ నెంబర్ 36ను అమలు చేస్తూ వేతనాలు పెంచాలని, గత సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలకు అనుగుణంగా జీవోలు జారీ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎలాంటి షరతులు లేకుండా మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ వర్తింప చేయాలని రిటైర్ అయిన, అనారోగ్యంతో ఉన్న, మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకోవాలని, ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సిఐటియు అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె శనివారం అర్ధరాత్రి నుండి ప్రారంభించిన విషయం విదితమే. ఆదివారం గుంటూరు తక్కెళ్లపాడు వద్ద, పల్నాడు జిల్లా నరసరావుపేటలో సమ్మె శిబిరాలను ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు సందర్శించి మద్దతు తెలిపారు. గుంటూరులో సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతు గత ప్రభుత్వం హయాంలో, కూటమి ప్రభుత్వ హయాంలో అనేక సార్లు శాంతియుతంగా వినతులు, ధర్నాల రూపంలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అయినా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందనా లేదన్నారు. మున్సిపల్ కార్మికులు సమ్మెలోకి వెళుతున్నామని గత నెల క్రితం నోటీసు ఇచ్చినప్పటికీ స్పందించకుండా, సమ్మెలోకి వెళుతున్న రోజు శనివారం హడావుడిగా మంత్రి ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వం సానుకూలంగా ఉందని అన్నారని, త్వరలో జీతాలు పెంచుతామన్నారని, కానీ ఎంత పెంచుతారు, ఎప్పుడు పెంచుతారో స్పష్టత లేనందునే అనివార్యంగా సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు ప్రభుత్వానిదే బాధ్యతని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని,

2లో

పిడుగురాళ్ల సమ్మెశిబిరంలో కార్మికుల నినాదాలు

పల్నాడు సిగలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం

4లో

దివ్య సంస్మరణ

అతి పిన్న వయస్సులోనే
అందనంత సుదూర
తీరాలకు వెళ్ళిన
మీ పవిత్ర ఆత్మకు
శాంతి కలగాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ మేకా సాయి సుమంత్ రెడ్డి

జననం : 05-05-1997 మరణం : 04-07-2025

ఇట్లు
కుటుంబ సభ్యులు

ది.14-7-2025 సోమవారం, గుంటూరుజిల్లా, తాడేపల్లి, నెహ్రూ బొమ్మ సెంటర్ లోని మా స్వగృహం నందు దివ్య సంస్మరణ జరుగును.

సమ్మెకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, వెంటనే పరిష్కరించాలని, తాగునీటి సరఫరాకు అంతరాయం నివారించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి గత సంవత్సర కాలంగా అనేక రూపాల్లో ప్రభుత్వానికి వినతులు అందించారని, శాంతియుతంగా ఆందోళనలు చేపట్టారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే జులై 12 అర్ధరాత్రి నుండి నిరవధిక సమ్మెలోకి వెళతామని ముందుగానే చట్టబద్ధమైన సమ్మె నోటీసు ఇచ్చినా ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సమ్మె అనివార్యం అయ్యిందన్నారు. గత ఆరు సంవత్సరాలుగా వేతనాలు పెంపుదల లేక, పెరిగిన ధరలతో చాలీ చాలని వేతనాలతోనే ఇంజినీరింగ్ కార్మికుల జీవితాలు కునారిల్లుతున్నాయన్నారు. గతంలో 2023 డిసెంబర్లో 17 రోజులపాటు జరిగిన సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం మేరకు రిటైర్మెంట్ అనంతరం చెల్లించే సర్వీసు పరిహారం పెంపుదల జీవో, మట్టి ఖర్చుల పెంపుదల జీవో, విధి నిర్వహణలో ఉండి చనిపోయిన సందర్భంగా కార్మికులకు ఇచ్చే పరిహారం పెంపుదల జీవోలు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చొరవ చేయకుండా సమ్మె ప్రారంభం అయిన తర్వాత అధికారుల్ని, అధికార పార్టీ పెద్దలను వినియోగించుకొని అదిరించి, బెదిరించి, లొంగదీసుకోవాలని ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇటువంటి అప్రజాస్వామిక చర్యలకు ప్రభుత్వం పాల్పడటం సరికాదన్నారు. ప్రభుత్వానికి కార్మికుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకొని, సమ్మె విరమింప చేయాలని కోరారు.

కార్మికులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-గుంటూరు

తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగించారనే పేరుతో 15 మంది కార్మికులకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం షోకాజు నోటీసులు జారీ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన కొందరు త్రాగునీటి సరఫరాకు అంతరాయం కలిగిస్తూ విధులకు గైర్హాజరు అయ్యారన్నారు. కార్మికుల గైర్హాజరు వల్ల నగరంలోని కొని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగిందన్నారు. సోమవారం ఉదయం 10 గంటల కల్లా విధులకు హాజరు కాకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కార్మికులపై కక్ష సాధింపు సరికాదు : సిఐటియు

ప్రజాశక్తి-గుంటూరు

శాంతియుతంగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పూనుకోవటం సరికాదని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్ర వ్యాపితంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమకు వేతనాలు పెంచాలని గత 6 సంవత్సరాలుగా ప్రభుత్వానికి, మంత్రులకు, మున్సిపల్ శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పందనా లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నేరుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు

2లో

ఆగని రేషన్ అక్రమ వ్యాపారం

(మొదటి పేజీ తరువాయి)

తరలిస్తుండగా దుర్గంపూడి రామిరెడ్డి అనే వ్యక్తి చూసి సాక్షాలతో సహా జాయింట్ కలెక్టర్ ఫిర్యాదు చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, విఆర్‌వో దుకాణానికి వెళ్లగా తాళం వేసి ఉండటంతో జెసికి సమాచారం ఇచ్చారు. దీంతో జెసి తాళాలు పగులగొట్టి సరుకు స్వాధీనం చేసుకోమని ఆదేశాలు ఇచ్చారు. జెసి ఆదేశాల మేరకు తాళం పగలగొట్టగా మొత్తం సరుకు డీలరు బయటకు తీసుకువెళ్లి అమ్ముకున్నట్టు కనుగొన్నారు. నరసరావుపేట బరంపేటలో లక్ష్మీ అనే మహిళ బియ్యం కోసం సమీపంలోని దుకాణానికి వెళ్లగా 20 కిలోలు ఇవ్వాల్సి ఉండగా రేషన్ డీలరు రెండు కేజీలు తగ్గించారు. అదేమని అడిగితే మాకు కోటా తగ్గించి పంపారన్నారు. ఇలా కొంత మంది డీలర్లు వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారు. మరో వైపు నరసరావుపేటలో బియ్యం బదులు సొమ్ములు ఇవ్వడాన్ని పలువురు వినియోగదారులు తప్పుపట్టారు. అయినా పలు కుంటి సాకులు చెబుతున్నారు. కొంత మంది వినియోగదారులతో బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారు. కొంత మంది డీలర్లు 17వ తేదీ వరకు రేషన్ పంపిణీ చేయకుండా ముందుగానే సరుకు అయి పోయిందని బోర్డులు పెడుతున్నారు. అదేమంటే పోర్టబుల్ కార్డులకు ఎక్కువ ఇచ్చామని చెప్పి తప్పించుకుంటున్నారు. అలాగే వృద్దులు,వికలాంగుల వద్దకు వెళ్తున్న డీలర్లు వారికి కూడా బియ్యం బదులు ఎక్కువ మందికి సొమ్ము ఇస్తున్నారు. 10 మంది వృద్దులు,వికలాంగులకు సంబంధించిన కార్డులు ఉంటే డీలరు 20 కేజీల బియ్యంను బండిపై పెట్టుకుని వెళ్లి గట్టిగా అడిగిన వారికి మాత్రమే బియ్యం ఇచ్చి మిగతా వారికి సొమ్ములు ఇచ్చేస్తున్నారని తెలిసింది. మొత్తంగా డీలర్లు నుంచి బియ్యం సేకరిస్తున్న మాఫియా సభ్యులు గతంలో మాదిరిగానే ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు, రైసు మిల్లులకు తరలిస్తున్నారు.

కార్మికులపై కక్ష సాధింపు సరికాదు : సిఐటియు

(మొదటి పేజీ తరువాయి)

నాయుడిని రెండు సార్లు యూనియన్ నాయకత్వం కలిసి వినతిపత్రాలు అందచేశామని గుర్తు చేశారు. అలాగే మున్సిపల్ శాఖ మంత్రి, మున్సిపల్‌శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సిడిఎంఎ అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చినా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంపునకు సంబంధించి ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు లేనందున గత్యంతరం లేక కార్మిక చట్టాల ప్రకారం 2025 జూన్ 6వ తేదీన రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చామని, అలాగే గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌కు 2025 జూన్ 12న సమ్మె నోటీసు ఇచ్చామని ముత్యాలరావు తెలియచేశారు. ఎమర్జెన్సీ సర్వీసులు కూడా నిలుపుదల చేస్తామని ముందుగానే నగరపాలక సంస్థ కమిషనర్‌కు సమ్మె నోటీసు ద్వారా తెలియజేశామన్నారు. అయితే చట్ట ప్రకారం సమ్మె నోటీసు ఇచ్చి సమ్మె చేస్తున్న కార్మికులను భయభ్రాంతులకు గురిచేసేందుకు నగరపాలక సంస్థ కమిషనర్ షోకాజు నోటీసులు ఇవ్వటం సరైన చర్య కాదని, శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మికులను రెచ్చగొట్టే పద్ధతిలో నోటీసులు ఇస్తే సమ్మెను ఉదతం చేస్తామని, పారిశుద్ధ్య కార్మికులను కూడా సమ్మెలోకి వస్తారని అన్నారు. నగరపాలక సంస్థ అధికారులు కార్మికులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. సమస్య పరిష్కారం దిశగా నగరపాలక సంస్థ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసి సమ్మె విరమింప చేసేందకు కృషి చేయాలని కోరారు.

కొండపల్లిలో కబడ్డీ అకాడమీ ప్రారంభం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

కొండపల్లిలో కబడ్డీ అకాడమీని ముఖ్యఅతిథిగా హాజరైన జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ) ప్రారంభించారు. కబడ్డీ కోచ్‌లు చట్టి శ్రీను, శ్రీరామ ఈశ్వర్, అశ్వజిత్ ప్రసాద్ ఆధ్వర్యంలో అకాడమీ ప్రారంభించారు. జాతీయస్థాయి పోటీలకు కబడ్డీ క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా అకాడమీ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఎర్రంశెట్టి నాని, భాను ప్రకాష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో

చిలకలూరిపేటలో

ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె సైరన్

(మొదటిపేజీ తరువాయి)

సంక్షేమ పథకాల అమలు, ఇంజనీరింగ్ కార్మికుల కేటగిరీల నిర్ధారణలో జరిగిన తప్పులు సరి చేయడం, గత 17 రోజుల సమ్మె ఒప్పందాలకు జీవోలు ఇవ్వకుంటే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెను ఉధతం చేస్తామని అన్నారు. మున్సిపల్ అధికారులు సమ్మె నేపథ్యంలో కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే గుంటూరు నగరం మొత్తం పారిశుధ్యం కార్మికులను కూడా సమ్మెలోకి వెళతారని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు పాశం పూర్ణచంద్రరావు, ఇంజనీరింగ్ విభాగం నాయకులు యాసిర్ ఖాన్, బాలకష్ణ, రవి, జానీ, నాగరాజు, మహేష్, సురేష్, గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, నగర కార్యదర్శి కె.శ్రీనివాస్, లీక్ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెతో గుంటూరు నగరంలో నీటి సరఫరా నిలిచిపోయింది. మొదటి రోజే సమ్మె ప్రభావంతో నగరంలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. నగరపాలక సంస్థకు చెందిన ఉండవల్లి, మంగళగిరి, సంఘం జాగర్లమూడి, తక్కెళ్ళపాడు హెడ్ వాటర్ కార్మికులు పూర్తిస్థాయిలో సమ్మెలోకి దిగడంతో గుంటూరు నగరానికి నీటి సరఫరా ఆగిపోయింది.

సింపతీ వద్దు సమస్య పరిష్కరించండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం సానుభూతి మాటలు కాకుండా నిర్దిష్టమైన హామీలతో సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో సమ్మె ఉదతం చేస్తామని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి (సిఐటియు) కె. ఉమామహేశ్వరరావు హెచ్చరించారు.నరసరావుపేట పట్టణంలో ఇంజనీరింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలిపిన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అర్ధాకలితో అలమటిస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల కుటుంబాలను పస్తుల నుండి గట్టెక్కించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నాటి నుంచి నేటి వరకూ అనేక రకాలుగా యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విన్నవిస్తూనే ఉన్నామని అయిన పట్టించుకోకపోవడంతో రాష్ట్రం లోని 50 మున్సిపాలిటీ లలో ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం తెల్లవారుజాము నుండి సమ్మెలోకి వెళ్లారన్నారు. ప్రజారోగ్యం, అవసరాలు దష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలన్నారు.గడిచిన 7 ఏళ్లుగా కేటగిరీల నిర్ణయంలో జరిగిన తప్పులను సరిచేసి జిఓ నెం.36 ప్రకారం వేతనాలు, స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు చెల్లించాలన్నారు. 2018లో టిడిపి హయాంలో చేపట్టిన పోరాటం ఫలితంగా జిఓ నెం 30 విడుదల చేసిందని గుర్తు చేశారు. అయితే తక్కువ కేటగిరీలను నిర్ణయించడంతో నైపుణ్యం కలిగిన ఇంజనీరింగ్ కార్మికులు తక్కువ వేతనాలకు పనులు చేయాల్సి వస్తుందన్నారు. తాము అధికారంలోకి వస్తే పారిశుధ్య కార్మికులకు రూ 18 వేలు వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని మండిపడ్డారు. కనీస వేతనం రూ 26 వేలు అమలు చేయాలన్నారు. పరిసరాల శుభ్రతకు ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడుతున్న మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించి వారి సేవా కోణంలో చూసి అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలన్నారు. సమ్మెను నిర్వీర్యం చేసేందుకు అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని బెదిరింపులు మానుకోకపోతే కలిసి వచ్చే సంఘాలను కలుపుకొని సిఐటియు అగ్రభాగాన ఉండి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్. సిలార్ మసూద్, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు షేక్ చిన్న, అల్లాబక్షు, సోమశేఖర్, కె.శ్రీను, బాలాజీ సింగ్, బి.శ్రీను, కిరణ్ కుమార్, మురళి, సామ్రాజ్యం, వెంకట్, వాసు, ఖాదర్, గౌస్, మాలిక్, సురేష్, రంగనాయకులు, కోటేశ్వరావు, షేక్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక ఐలాండ్ సెంటర్ వద్ద ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దశల వారీగా అనేక ఆందోళనలు చేసి, వినతి పత్రాలు అందజేసి నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఈరోజు పారిశుద్ధ ఇంజనీరింగ్ కార్మికులను రోడ్డు మీద నెట్టిందని, ఆయన విమర్శిం చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేముల శ్రీనివాసరావు, మధు, పవన్ కుమార్, రమేష్, వాసా ప్రతాప్, కాంద్రగుంట రాజు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నిర్దిష్టమైన హామీలతో సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో సమ్మెను ఉధతం చేస్తామని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి (సిఐటియు) కె. ఉమా మహేశ్వరరావు ఆదివారం నాడు హెచ్చరించారు. పట్టణంలో సిఐటియు కార్యాలయంలో ఇంజనీరింగ్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నాటి నుంచి నేటి వరకూ అనేక రకాలుగా యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విన్నవిస్తూనే ఉన్నామని అయిన పట్టించుకోకపోవడంతో తాము అధికారంలోకి వస్తే పారిశుధ్య కార్మికులకు రూ 18 వేలు వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని మండిపడ్డారు. సమ్మెను నిర్వర్యం చేసేందుకు అధికారులు బెదిరింపులు కు పాల్పడుతున్న రాణి బెదిరింపు లు మానుకో కుంటే కలసి వచ్చే సంఘలను కలపుకుని సిఐటియు అగ్ర భాగాన ఉండి పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు శిలార్ మసూద్ వెంకట్రావు, నాగరాజు, మధు,రామాంజి,మహేష్, రాజు,అంకారావు,మధు నాయక్, అశోక్, సిఐటియు మండల కార్యదర్శి పెరునయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాల హారికపై దాడికి హోంమంత్రిదే బాధ్యత

మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారికపై జరిగిన దాడి ఘటనకు హోం మంత్రి వంగలపూడి అనిత సమాధానం చెప్పాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. గుంటూరు క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్‌ల ప్రోత్సాహంతోనే టిడిపి సైకోలు ఈ దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. టిడిపి నాయకులపై విమర్శలు చేస్తే రాద్ధాంతం చేసే చంద్రబాబు, మంత్రులు వైసిపి మహిళా నాయకులపై దాడి జరిగితే ఎందుకు స్పందించరన్నారు. ఎవరైనా మహిళా నాయకులు ఒక్కటే కదా...మీకు ఒక రూలు, మాకో రూల్ అనుంటున్నారని ఎద్దేవా చేశారు. టిడిపి నాయకులపై విమర్శలు చేస్తే కేసులు నమోదు చేసే పోలీసులు తమ పార్టీ నాయకులపై దాడి చేసినా కేసులు పెట్టరన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన వైనంపై ప్రతిపక్షంగా తాము 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' పేరుతో ఒక కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. చంద్రబాబు మోసాలను ప్రశ్నించాలని ప్రజలను చైతన్యవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లోనూ మొదటి దశలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. గతంలో టిడిపి ప్రతిపక్షంలో ఉండగా వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు,నిరసనలు చేయలేదా అని ప్రశ్నించారు. బీసీ నాయకురాలు, కష్ణాజిల్లా ప్రథమ పౌరురాలు ఉప్పాల హారిక గుడివాడకు చేరుకుంటే, ఆమె కారుపై తెలుగుదేశం, జనసేన గుండాలు రెచ్చిపోయి దాడులు చేశారు. కారు అద్దాలు పగులకొట్టారు, ఆమెపై దాడికి ప్రయత్నించారు. దీనిపై పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారన్నారు. అసాంఘిక శక్తులను అదుపు చేసే సామర్థ్యం పోలీసులకు లేదా? దాడి చేస్తున్న గుండాలను అరెస్ట్ చేయరా? మద్యం, గంజాయి మత్తులో దాడులు చేస్తే, మౌనంగా పోలీసులు నిలబడిపోయారు. ఒక బీసీ మహిళపై పోలీసుల సమక్షంలోనే దాడులు జరుగుతుంటే, రక్షణ కల్పించలేని అసమర్థతతో వ్యవస్థను నడుపుతున్నారా అని ప్రశ్నించారు.

రేషన్ షాపు ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నాదెండ్ల

పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామంలో శ్రీ వినాయక డ్వాక్రా మహిళా గ్రూపునకు చెందిన పోతిరెడ్డి మల్లేశ్వరి అనే పేరు మీద ఉన్న రేషన్ షాపును (నం.37) ఆమె భర్త పోతిరెడ్డి అంజిరెడ్డి పేదవారికి చెందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా దుర్గం పూడి రామిరెడ్డి అనే వ్యక్తి చూసి సాక్షాలతో సహా జాయింట్ కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు ఆర్ఐ సంతోషి కుమారి, వీఆర్వో ప్రేమ్ రాజు ఆదివారం గ్రామానికి విచ్చేసి రేషన్ షాపు వద్దకు వెళ్లి అంజి రెడ్డిని రేషన్ షాపు తాళం తీయమని చెప్పారు. ఆయన ఇప్పుడే వస్తానని వెళ్లి ఎంతకీ రాకపోవడంతో జెసికి మళ్లీ ఫిర్యాదు చేశారు. జెసి ఆదేశాల మేరకు తాళం పగలగొట్టి షాపులో చూడగా షాపులో బియ్యం, చక్కెర బస్తాలు కనిపించలేదు. అది చూసిన అధికారులు ఆశ్చర్యపోయారు. గోడౌన్ సీజ్ చేసి అంజిరెడ్డిపై కేసు పెట్టి విచారిస్తునట్లు నాదెండ్ల మండల సబ్ ఇన్‌స్పెక్టరు వంటి పుల్లారావు ఆదేశాల మేరకు ఏఎస్ఐ రమేష్ సంఘటన స్థలానికి వచ్చి తనిఖీలు నిర్వహించారు.

నిలిచిపోయిన ట్రాఫిక్, రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ఏడాదిగా విద్యుత్ సమస్యతో సతమతం

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన మహిళలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గత సంవత్సరం నుండి విద్యుత్ సమస్యలతో అల్లాడి పోతున్నామని ప్రత్తిపాడు నియోజక వర్గ కేంద్రంలోని పూల బజార్ మహిళలు పాత మద్రాసు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మాకు రోజు కరెంట్ తీస్తున్నారు. చుట్టుపక్కల మాత్రం కరెంట్ ఉంటుంది. శనివారం ఉదయం 11 గంటలకు పోయి ఇప్పటికీ రాలేదు. కనీసం ఎప్పుడు వస్తుందని అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. ఇళ్ళలో ఒకవైపు ఉక్క పోత, మరో వైపు దోమ లతో ఇబ్బంది పడుతున్నాం, కరెంట్ బిల్లు మాత్రం నెలనెలా వేలకు వేలు కట్టించుకుంటున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించడంతో రెండు వైపుల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న వెంటనే ఎస్ఐ అక్కడకు చేరుకొని నిరసన తెలుపుతున్న మహిళలకు విద్యుత్ అధికారులతో మాట్లాడతాననీ, వాహనదారులకు ఇబ్బంది కలిగించకూడదని సర్ది చెప్పారు. నిరసనతో సుమారు అరగంట పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

లైన్‌మేన్‌ల కొరత వల్లే

ప్రత్తిపాడు గ్రామంలో సుమారు ఐదువేల పైబడి కనెక్షన్లు ఉంటే నలుగురు లైన్‌మేన్‌లు ఉండాల్సి ఉండగా కనీసం ఒక్కరు కూడా లేరు. ఏదైనా సమస్య వస్తే పక్కా గ్రామాల లైన్‌మేన్‌లు వస్తారు. అసలు మండలంలో మొత్తం 24 మంది ఉండాల్సి ఉండగా కేవలం 9 మంది విద్యుత్ లైన్‌మేన్‌లు ఉండడంతో వీరికి పనిభారం ఎక్కువ అవుతోందని తోటి అధికారులు తెలుపుతున్నారు.

క్యూ కార్యాలయంపై దాడి అమానుషం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెలంగాణలో క్యూ న్యూస్ కార్యాలయంపై జరిగిన దాడిని జర్నలిస్ట్ సంఘాలు ఖండించాయి. తెలంగాణ శాసనమండలి సభ్యులు తీన్మార్ మల్లన్న పై 50మంది వ్యక్తులు మూకుమ్మడి దాడి చేయడం హేయమైన చర్యని ఇండియన్ జర్నలిస్ట్స్ యూని యన్ సభ్యులు ఓ మార్కండేయులు, గుం టూరు జిల్లా ఎలాక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్యక్షులు కారుమంచి సునీల్ సందీప్ ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక మీడియా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమా వేశంలో మార్కం డేయులు మాట్లాడు తూ మీడియా కార్యాలయాలు, జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవా లన్నారు. జర్నలిస్టు ల రక్షణకు ప్రత్యేక చట్టాలను అమలు చేయాలన్నారు. తీన్మార్ మల్లన్నకు వ్యక్తిగత అంగ రక్షకులను పెంచాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కోరారు. దాడి చేసిన నిందితులను వేంటనే ఆరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వేమూరి ప్రసన్నకుమార్

శిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న గద్దె చలమయ్య

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

విజ్ఞాన కేంద్రం కన్వీనర్ షేక్ మస్తాన్ వలి - రానున్న రోజులలో మరిన్ని సేవా కార్యక్రమాలు : గద్దె చలమయ్య

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్య క్రమాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞాన కేంద్రం కన్వీనర్ షేక్. మస్తాన్ వలి కోరారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బసవ గ్యాస్ట్రో-లివర్ కేర్ సెంటర్ సహకా రంతో పట్టణంలోని ఇస్లాంపేట శ్రీగిరి మోడల్ ప్రైమరీ స్కూల్ లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో ప్రముఖ సర్జికల్ గ్రాస్ట్రో ఎంట్రాలజిస్ట్, హెపటోబిల్లియరి సర్జన్ డాక్టర్ వేమూరి ప్రసన్న కుమార్ పాల్గొని ప్రజలకు గ్యాస్ట్రో సమస్యలతో పాటు బిపి, షుగర్, జలుబు, దగ్గు, జ్వరం వంటి సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సదస్సులో డాక్టర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంప్రదాయ ఆహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాల న్నారు. తినేఆహారాల పదార్థాలపై ఆరోగ్యం ఆధారపడి ఉంటుం దన్నారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన విజ్ఞాన కేంద్రం నిర్మాణ కమిటీ కన్వీనర్ గద్దె చలమయ్య మాట్లాడుతూ రానున్న రోజుల లో విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు మరిన్ని చేపడతామని తెలిపారు. ఉచిత వైద్యశిబిరాలతో పాటు పల్నాడుజిల్లా సమగ్రాభివృద్ధికి సంబంధించి మేధావులతో చర్చించడం, అంతరించి పోతున్న దేశసంస్కృతి సాంప్రదా యలు, కళలు బతికించడం ప్రజలలో అభ్యుదయ భావాలు రేకెత్తించి కదిలించే ఉద్యమ కేంద్రంగా పల్నాడు విజ్ఞాన కేంద్రం విరాజిల్లుతుందన్నారు. ఈ వైద్య శిబిరంలో 100 మందికి పైగా వైద్య సేవలు పొందారు. అనంతరం డాక్టర్ ప్రసన్నకుమార్‌ను సత్కరించారు. విజ్ఞాన కేంద్రం సభ్యులు కె.రామారావు, బి నాగేశ్వరావు, ఆంజనేయులు, మస్తాన్ రావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దని కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లి

ఆదాని స్మార్ట్ మీటర్ మన ఇంటి వద్దంటూ పట్టణ పౌర సంక్షేమ సంఘం ముద్రించిన కరపత్రాలను ఆదివారం తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్‌లో ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. రోడ్డు కూడళ్ళలో జరిగిన గ్రూప్ మీటింగ్‌లో నాయ కులు మాట్లాడారు. కరెంటు చార్జీలు తగ్గిస్తామని అధికా రంలోకి వచ్చిన కూటం ప్రభుత్వం చార్జీలు తగ్గించకపోగా ట్రూఆప్ చార్జీల పేరుతో అదనభారం మోపుతోందని మండి పడ్డారు. ఇది చాలదన్నట్లు మోడీకి అత్యంత ప్రీతిపాత్రుడైన ఆదాయం మీటర్లు బిగించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మీటర్ కయ్యే ఖర్చు రూ. 10వేల నుండి రూ 17వేల వరకు ఉంటు దని చెప్పారు. మీటర్ అద్దె పేరు 93 నెలలు మీటర్ అద్దె పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తారని చెప్పారు. పది సంవత్సరాలు నిర్వహణ బాధ్యత ఆదాని కంపెనీకి అప్పగిం చడం పట్ల ప్రజల నుండి విపరీతంగా డబ్బులు వసూలు చేస్తారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే పగల గొట్టాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సుంద రయ్య నగర్ కార్యదర్శి నారిన నాగేశ్వరరావు, ఎస్.కె.భాష, బబ్బిలి రామారావు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం

వైసిపి నేతలపై తప్పుడు కేసులు

కూటమి పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ

వైసిపి రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి నాయకులపై తప్పడు కేసులు నమోదు చేస్తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేస్తున్నారని వైసిపి రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. టిడిపి నేతల దాడిలో గాయపడి గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మన్నవ సర్పంచ్ నాగమల్లేశ్వర రావును ఆయన ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సజ్జల మీడియాతో మాట్లాడుతూ నాగమల్లేశ్వర రావు కోలుకుంటున్నారని టిడిపి వారు కావాలనే దాడికి పాల్పడ్డారని తెలిపారు. మల్లేశ్వరరావును హతమార్చేందుకు ప్రయత్నించారని చెప్పారు. వైసిపి నాయకులపై దాడి చేసి తిరిగి తమ పార్టీ నేతలపైనే దాడులు చేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షంకు ఉన్న రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారన్నారు. ప్రజల తరుపున మాట్లాడే హక్కును హరిస్తున్నారని తెలిపారు. పొగాకు,మిర్చి, మామిడి, ధాన్యం ప్రతి రైతుకీ అన్యాయమే జరిగిందన్నారు. ప్రభుత్వం పరిష్కరిస్తే వైయస్ జగన్ రావాల్సిన అవసరమేమిటని ప్రశ్నించారు. తమ పార్టీ నాయకులను ఎంత వేధించినా వెనక్కి తగ్గే ప్రసక్తేలేదన్నారు. ప్రజల తరుపున పోరాడతామని, ప్రజల సమస్యలపై రాజీలేనిపోరాటం చేస్తామన్నారు. ధాన్యం, పొగాకు, మిర్చి, మామిడి ఏ రైతుకూ గిట్టుబాటుధర లేక ఆందోళనలో ఉన్న అన్నదాతలను జగన్మోహన్ రెడ్డి పరామర్శిస్తే... అప్పుడు హడావుడిగా ఢిల్లీకి లేఖలు రాస్తున్న ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సమస్యలను స్పందిస్తే ఎదురుదాడి చేయటం ఏమిటన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీ, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నాయకురాలు నూర్ ఫాతిమా, డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు పాల్గొన్నారు.

జనరల్ బాడీ సమావేశంలో కార్మికులు

సున్నం మిల్లు కార్మికుల కూలీ రేటు పెంచాలి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సున్నం మిల్లు కార్మికుల కూలీ రేట్ల ఒప్పందం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలీ రేట్లు ఒప్పందం జరుగుతుందని ఈ ఒప్పందం ముగిసే సమయం దగ్గర పడుతున్న సందర్భంగా పట్టణం లోని సున్నం మిల్లుల ఏరియాలో సిఐటియు ఆధ్వ ర్యంలో ఆదివారం కార్మికుల జనరల్ బాడీ సమా వేశం నిర్వహించారు. సున్నం మిల్లు కార్మికుల యూనియన్ సిఐటియు అనుబంధం అధ్యక్షుడు జె.జయరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భం గా సున్నంమిల్లు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర వస్తువులకు అనుగుణంగా కార్మికులకు కూలి రేట్లు పెంపుదల చేయాలని పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యుటీ సర్వీస్ వంటి చట్టపర మైన సౌకర్యాలు కల్పించాలని, పని ప్రదేశాల్లో సౌక ర్యాలు కల్పించాలని, మహిళలకు మరుగు దొడ్లు, విశ్రాంతి గదులు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. సున్నం మిల్ వర్కర్స్ యూని యన్ నాయ కులు యతీరాజుల శివయ్య, చిట్టిబోయిన గిరిబాబు, గురవయ్య, కాకర్ల సాంబయ్య , రామారావు, బత్తుల కొండలు, నల్లమేకల యలమంద, వెంకటేశ్వర్లు దేవరంపాడు శ్రీను, రాంబాబు, పందిటి నాగరాజు, వెంకయ్య పాల్గన్నారు.

కవి కరీముల్లాకు జీవన సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి - వినుకొండ

కవి కరీముల్లా

వినుకొండకు చెందిన ప్రసిద్ధ కవి కరీముల్లాకు ఈ నెల 20 వ తేదీన హిందూపురంలో తిరుపతి వేంకట కవులు జీవన సాఫల్య పురస్కారం 2025 ప్రదానం చేయనున్నారు. భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ, సత్యసాయి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం అఖిల భారత స్వాతంత్ర్య ఉద్యమకారుడు షహీద్ టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ సౌజన్యంతో జరుగుతుంది. ముఖ్య అతిథులుగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల్ గౌడ్, ఉమర్ అలీషా,గజల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొంటున్నారు. ఇప్పటికే కరీముల్లా కవిత్వం పలు భాషల్లో అనువదింపబడి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆయన ఖ్యాతిని ఇనుమడింప జేసింది. పలు విశ్వవిద్యాలయంలో కరీముల్లా కవిత్వంపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఎంఏ చదివే విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఉన్నాయి. కరీముల్లాకు ఈ పురస్కారం లభించడం వినుకొండ ప్రాంతానికే గర్వకారణం అని పలువురు కవులు, కళాకారులు అభినందనలు తెలియజేశారు.

విజేతలతో నిర్వాహకులు

అండర్ -13 చెస్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - మాచర్ల

పల్నాడు జిల్లా చెస్ డెవలప్మెంట్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అండర్-13 చెస్ జట్ల ఎంపిక పోటీలను ఆదివారం మాచర్లలోని కఅష్ణవేణి టాలెంట్ స్కూల్లో నిర్వహించారు. ఈ పోటీలలో బాలుర విభాగంలో మొదటి రెండు స్థానాలలో నిలిచిన కెఎస్.మోజెస్, కెజె. మాగ్నస్, బాలికల విభాగంలో బి.మేఘ శ్రీ కోమలి, ఎం.శ్రావ్యలు గెలుపొందారు. ఈ నలుగురు ఆగష్టు 2, 3 తేదీలలో మచిలీపట్నంలో జరిగే అండర్- 13 రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని పల్నాడు చెస్ అకాడమీ కోచ్ కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ కిరణ్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే చదరంగం నేర్చుకోవడం వల్ల ప్రతి పని మీద ఏకాగ్రత అనేది ఉంటుందని, తద్వారా చదువు కూడా సులభతరంగా అర్థం చేసుకోవచ్చునన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ ప్రిన్సిపాల్, యాజమాన్యం వారు, యూనివర్సల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎ.వీరాంజనేయులు, వేణు, పాపారావు, పాఠశాల సిబ్బంది, క్రీడాకారులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

551.20 అడుగుకుల చేరిన సాగర్ నీటిమట్టం

ప్రజాశక్తి -విజయపురిసౌత్

నాగార్జుసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 551.20 అడుగులకు చేరింది. ఇది 206,7042 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎస్ ఎల్బీసీకి 1,650 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 63.317 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

విజయపురిసౌత్ సమీపంలోని మినీ విమానాశ్రయం గూగల్ మ్యాప్

పల్నాడు సిగలో.. గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం

- సాగర్ విమానాశ్రయం విస్తరణకు ముందుకొచ్చిన ప్రభుత్వం
- ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సాంకేతిక, ఆర్థిక సాధ్యత నివేదికతకు బిడ్లు ఆహ్వానం
- ఆరు దశాబ్ధాలుగా ప్రణాళికలకే పరిమితం

విజయపురిసౌత్ సమీపంలోని రన్‌వే

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

అంతర్జాతీయ పర్యాటక ప్రాంతాల్లో నాగార్జుసాగర్ ఒకటి. ఇది పల్నాడు జిల్లాకు పై ఎత్తున వున్న మాచర్ల మండల పరిధిలో వుంది. ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేసి పర్యాటకాభివృద్ధి చేయాలని పాలకుల దశాబ్ధాల ఆలోచన. 60 ఏళ్ళుగా ప్రణాళికలు వేస్తున్నారు కానీ కార్యరూపం దాల్చటం లేదు. తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాగార్జునసాగర్, ఒంగోలు ప్రాంతాల్లో రెండు నూతన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు నిర్మించటానికి సాంకేతిక, ఆర్థిక సాధ్యత నివేదిక తయారీకి బిడ్లను ఆహ్వానిస్తూ ఏపీఏడీసీఎల్ ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ కార్పోరేషన్ లిమిటెడ్ ఈనెల 8వ తేదీన ప్రకటన విడుదల చేసింది. బిడ్ల సమర్పణకు చివరి తేది జూలై 29గా నిర్ణయించగా, టెక్నికల్ బిడ్లు జూలై 30న, ఫైనాన్షియల్ బిడ్లు ఆగస్టు 4న తెరవనున్నారు. ఒంగోలులో ఎయిర్‌పోర్ట్ నగరానికి 7 కి.మీ దూరంలో ఏర్పాటు చేయనుండగా, నాగార్జునసాగర్‌లో విజయపురి సౌత్ వద్ద నిర్మాణం జరగనుంది.

ఆరు దశాబ్ధాల్లో అనేక ప్రణాళికలు..

అప్పుడెప్పుడో ఆరు దశాబ్ధాల క్రిందట నాగార్జున సాగర్ డ్యాం నిర్మాణ సమయంలో శంకుస్థాపన నిమిత్తం అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రాక కోసం విజయపురి సమీపంలో రన్‌వే, కంట్రోల్ రూం నిర్మించారు. నిర్మాణాన్ని పరిశీలించటానికి వచ్చిన విదేశీ ప్రతినిధులు, రాష్ట్రపతి, గవర్నర్లు, కేంద్ర మంత్రులు, ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం కోసం ఇందిరాగాంధీ విమానాల ద్వారా ఇక్కడి రన్‌వేపై దిగారు. 1964 మాచర్ల వరదలు సమయంలో సహాయం అందించటానికి ఇక్కడ విమానాలు దిగాయి. ఆ తరువాత పాలకులు పట్టించుకోక పోవటంతో 2010 వరకు ఇక్కడ ఒక్క విమానం వాలింది లేదు. ఎగిరింది లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నాగార్జున సాగర్ విమానాశ్రయాన్ని ఫ్లయి టెక్ ఏవియేషన్ విమాన శిక్షణా సంస్థకు లీజుకు ఇచ్చారు. 2010 నుండి ఏవియేషన్ సంస్థ శిక్షణా విమానాలను ఇక్కడ నుండే నడుపుతోంది. అప్పుడప్పుడు ఈ శిక్షణా విమానాలు ఆకాశంలో కనపడుతూంటాయి. ఇప్పుడున్న విమాశ్రయం 80 ఎకరాల్లో విస్తరించి వుంది. 2016లో సీఎం నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి సారించి నాగార్జునసాగర్‌తో పాటు ప్రకాశం జిల్లా దోనకొండలను గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టులుగా ప్రకటించారు. అంతర్జాతీయ స్థాయికి తగ్గట్టుగా 1000 ఎకరాల్లో విస్తరించటానికి భూముల సేకరణకు అవకాశాలు పరిశీలించాలని ఆదేశించారు. ఆ సమయంలో పౌరవిమానాయాన మంత్రిగా నున్న అశోక గజపతిరాజు ఢిల్లీ నుండి విమానాయాన అధికారులను సాగర్ పంపారు. అధికారులు ఇక్కడికి వచ్చి పరిశీలించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరిగి నాగార్జునసాగర్ విమానాశ్రయం అభివృద్ధిపై దృష్టి సారించారు. ఈ ఏడాది జనవరిలో 1800 ఎకరాలలో ఎయిర్‌పోర్టు నిర్మించేందుకు అధికారులు స్థల పరిశీలన చేశారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ జాయింట్ జనరల్ మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బఅందం ప్రాజెక్టు సమీపంలో గతంలో ఏర్పాటుచేసిన రన్‌వే సమీపంలోని భూములను పరిశీలించింది. మాచర్ల మండలం విజయపురి సౌత్, పసువేముల, చింతలతండ, నాగులవరం భూములను పరిశీలించారు. ఆతరువాత ఎటువంటి ప్రగతి కనపడలేదు. తాజాగా ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సాంకేతిక, ఆర్థిక సాధ్యత నివేదిక తయారీకి ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ కార్పోరేషన్ లిమిటెడ్ బిడ్లు ఆహ్వానించింది.

వాటర్ ఏరోడ్రోమ్‌గా నాగార్జునసాగర్ !

2019లో నాగార్జునసాగర్ కేంద్రంగా సీ విమానాలు సర్వీసులు నడపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయిం చింది. ఉడాన్ స్కీమ్ కింద నాగార్జునసాగర్ రిజర్వాయర్‌ను వాటర్ ఏరోడ్రోమ్ గా అభివృద్ధి కోసం మొదటి విడత కింద రూ.20 కోట్లు విడుదల చేస్తున్నట్టు ఇదివరకే కేంద్రం ప్రకటించింది.సాగర్‌లో విమానాలు ఎక్కడ దిగాలి? ఎక్కడి నుంచి ఎక్కడికి విమానాలు నడపాలి? అనే దానిపై స్టడీ చేసింది. కెప్టెన్ ఇల్షాద్ అహ్మద్ నేతృత్వంలోని టీమ్ డీపీఆర్ రెడీ చేసి కేంద్రానికి పంపింది. సాగర్ రిజర్వాయర్ నుంచి విమానాలు నడపొచ్చని అందులో పేర్కొంది. తెలంగాణ, ఏపీ మధ్య 9,12,20 సీట్ల సామర్థ్యం కలిగిన సీ ప్లేన్ లు నడిపేందుకు అనుకూలంగా ఉందని గుర్తించింది. నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు సీ విమానాలు నడిపేలా ప్రణాళికలు రూపొందించింది. శ్రీశైలం, విజయవాడకు సేవలు అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. అయితే ఇది కూడా కార్యరూపం దాల్చలేదు.

విమానాశ్రయం నిర్మాణంతో పర్యాటకాభివృద్ధి..

నాగార్జునసాగర్ అంతర్జాతీయ పర్యాటక ప్రాంతం. బౌద్ధ మత స్థాపకుడైన గౌతమ బుద్ధుని అవశేషం(బుద్ధుని ధాతువు) వున్న ప్రాంతమిది. ఇక్కడకు శ్రీలంక, నేపాల్, చైనా, టిబెట్, కాంబోడియా, వియత్నాం, బర్మా, ఇండోనేషియా తదితర దేశాల నుండి పర్యాటకులు, బౌద్ధ మతస్థులు వస్తూంటారు. ఎత్తిపోతల జలపాతం, అనుపు, ఐల్యాండ్ మ్యూజియం వంటి ప్రముఖ పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. విమానాశ్రయం ఏర్పాటు వల్ల విదేశీ అతిథుల రాక సులభతరమై పర్యాటకాభివఅద్ధి జరుగుతుంది. అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. వెనుకబడిన మాచర్ల ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

సినిమా షఉటింగ్‌లు పెరిగే అవకాశం..

సినిమా షూటింగ్‌లకు సాగర్ పరిసర ప్రాంతాలు అనుకూలమైనవి. పదుల సంఖ్యలో సినిమాలు ఇక్కడ షఉటింగ్‌లు జరుపుకున్నాయి. ఇప్పటికీ జరుపుకుంటున్నాయి. ఎత్తిపోతల జలపాతం, ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ప్రముఖ హీరోల సినిమాలు చిత్రీకరణలు జరిగాయి. సాగర్ ఎయిర్ పోర్టులో జూనియర్ ఎన్టీఆర్ నటించిన బాద్‌షా సినిమా షఉటింగ్ జరిగింది. ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగితే సినిమా షూటింగ్‌లు పెరిగే అవకాశముంటుంది.

రెండు తెలుగురాష్ట్రాలకు ప్రయోజనం...

నాగార్జునసాగర్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో విస్తరించి వుంది. ఆంధ్ర వైపు విజయపురిసౌత్, తెలంగాణా వైపు విజయపురి నార్త్ లు వున్నాయి. సాగర్ ప్రాజెక్టు కూడా రెండు రాష్ట్రాలకు ఎంతో కీలకం. ప్రాజక్టు నీటితో నిండి నీరు విడుదల చేసే సమయంలో వేలాది మంది పర్యాటకులు సాగర్‌కు వస్తూంటారు. విమానాశ్రయం నిర్మించటం ద్వారా రెండు రాష్ట్రాలు ప్రయోజనాలు పొందనున్నాయి. తెలంగాణ శంషాబాద్, ఆంధ్రప్రదేశ్ విజయవాడ నుండి సాగర్‌కు విమానాలు నడపటం ద్వారా పర్యాటకాభివృద్ధి సాధించవచ్చు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - సత్తెనపల్లి

వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సాయికృష్ణ

ముప్పాళ్ల మండలం దమ్మాలపాడు జడ్పీ హైస్కూల్లో సత్తెనపల్లి సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించిందని హాస్పిటల్ ఎండి డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ఆదివారం తెలిపారు. శిబిరంలో దమ్మాలపాడు, పరిసర గ్రామ ప్రజలు 370 మందికిపైగా వైద్య పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు తీసుకున్నారు. వైద్య శిబిరంలో బిపి, షుగర్, ఈసీజీ, 2డి ఎకో, ఊపిరితిత్తుల సామర్థ్యం తెలిపే పరీక్ష మొదలైనవి ప్రముఖ వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉచితంగా చేసి వారికి తగిన సూచనలు, వైద్య సలహాలు అందజేశారు. శిబిరంలో డాక్టర్ సింగరాజు విద్య, గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్‌కి చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల శివప్రసాద్, ప్రముఖ ఎముకలు, కీళ్ళ వైద్య నిపుణులు డాక్టర్ ఎంఎల్‌వి సాయికృష్ణారెడ్డి గార్లు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఈపూరు పిఎసిఎస్ చైర్మన్‌గా హనుమయ్య

ప్రజాశక్తి-ఈపూరు

బాధ్యతలు చేపడుతున్న విడపలపాటి హనుమయ్య

పిఎసిఎస్ (ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం) త్రిసభ్య కమిటీ సభ్యులు మండల కేంద్రం ఈపూరు పిఎసిఎస్ కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు చేపట్టారు. చైర్మన్‌గా ముప్పాళ్ళకు చెందిన విడపలపాటి హనుమయ్య, కమిటీ సభ్యులుగా కొచ్చర్ల గ్రామానికి చెందిన అయినాల కోటేశ్వరరావు ఉప్పరపాలెం గ్రామానికి చెందిన చిందుకూరి నరసింహారావు సభ్యులుగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రైతులకు అండగా ఉంటూ సహకారం అందించాలన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. నూతన చైర్మన్ విడపలపాటి హనుమయ్య మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఈఓ పోకా కోటేశ్వరరావు, పల్నాడు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు,సీనియర్ న్యాయవాది ఎన్.రామ కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు ఎం.సత్యనారాయణ, బి.రామయ్య, బి.వెంకట కోటయ్య, టి.బాలయ్య, జి.వీరాంజనేయులు, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించటానికి వస్తే ప్రతిఘటించండి

ప్రజాశక్తి - పెదకాకాని

స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే ప్రతిఘటించాలని సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక సుందరయ్య కాలనీలో స్మార్ట్ మీటర్ల వినియోగంపై విలేకరుల సమావేశంలో నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలకు మోయలేని భారాన్ని వేస్తుందన్నారు. విద్యుత్ ఆదానీ సంస్థలకు అప్పచెప్పే ప్రయత్నంలో భాగంగా స్మార్ట్ మీటర్లను బిగించే ప్రయత్నం చేస్తున్నా రన్నారు. ఈ స్మార్ట్ మీటర్లు మొబైల్ ప్రీపెయిడ్ బిల్లు ఎలా అయితే చెల్లిస్తామో

సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

అలానే వీటికి ముందుగానే చెల్లింపులు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది అన్నారు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండే సమయంలో నాణ్యమైన విద్యుత్ పేరుతో అధిక ధరలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంటుంది అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల నుండి విద్యుత్ సంస్థలను ఆదాని కంపెనీలకు అప్ప చెప్పడానికి ఇప్పటికే తెర వెనుక కుట్రలు జరుగుతున్నాయి అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ పెదకాకాని మండలం లోని సుందరయ్య నగర్, ఎన్టీఆర్ కాలనీ, జాన్ హాస్పర్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, స్వర్ణపురి కాలనీ, వడ్డెర కాలనీ తదితర కాలనీలలో ఏళ్ల తరబడి ప్రభుత్వ స్థలాలలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని ఉంటున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని. గుంటూరు ఛానల్ పూడిక తీసి తెగిన కట్టలకు మరమ్మతులు చేయాలన్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఉన్న రోడ్లు, డ్రెయినేజీలు వెంటనే బాగు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నంబూరు శాఖ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, పెదకాకాని శాఖ కార్యదర్శి బి.బాబురావు, బురదగుంట సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ పనితీరు పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల

రాయితీపై వ్యవసాయ యంత్రాల పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అధికారు పారదర్శకంగా -న్నప్పుడే ప్రభుత్వం అందిస్తున్న పదగామ స్థాయిలో అధికారు రైతుపట్ల జాగృత్త వహించాలని వ్యవసాయ అధికారలకు మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రభుత్వ సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరా పంపిణి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎపి స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా వ్యవసాయ సాగుకు ఉపయోగకరమైన వ్యవసాయ పనిముట్లు యంత్ర పరికరాలను ఆయన రైతుకు అందజేశారు. మండల పరిధిలో 33 మంది రైతుకు రూ. 4,87,060 సబ్సిడీతో కూడిన వ్యవసాయ పుముట్లు పంపిణీ చేశారు. రోటవేటర్, తైవాన్ స్ప్రేయర్లు, నాగళ్లు, కల్టివేటర్లు, కిసాన్ డ్రోన్లు రైతుకు అందజేశారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖను గత ప్రభుత్వం విస్మరించిందన్నారు. రైతు పండించిన పంటను కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి కేవం 48 గంటల్లోనే రైతు ఖాతాల్లోకి జమ చేశామన్నారు. జిల్లా మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, తెనాలి మండల సహాయ వ్యవసాయ సంచాలకులు కె.రాజకుమారి, మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, మహిళ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా గుంటూరు ఛానల్ మరమ్మతు పనులు

ప్రజాశక్తి - పెదకాకాని

నిత్యం కొన్ని లక్షల మందికి మంచినీరు , పొలాలకు సాగునీరు అందించే గుంటూరు ఛానల్ కాలువ గుర్రపు డెక్క తొలగింపు, కాలువ గట్ల మరమ్మతు పనులు అసంపూర్ణంగా జరుగుతున్నా యని సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. ఆదివారం రైతులతో కలిసి గుంటూరు ఛానల్‌ను పరిశీలించారు. శివాజీ మాట్లాడుతూ కొన్ని లక్షల మందికి మంచి నీరు పొలాలకు సాగునీరు అందించే గుంటూరు ఛానల్ కాలువ గుర్రపు డెక్కతో పూడుకుపోయిందని, అయితే గుర్రపు డెక్క పూర్తిగా తొలగించడం కాకుండా దానిపై గడ్డి మందు పిచికారి చేశారన్నారు గడ్డి మొందు పిచికారి చేయడంతో నీరు విషం పూరితంగా మారాయని, ఈ నీరు తాడేపల్లి మండలం సీతానగరం నుండి వట్టిచెరుకూరు మండలం వరకు గుంటూరు, చుట్టుపక్కల 44 గ్రామాలకు త్రాగటానికి సరఫరా అవుతుందన్నారు. ప్రజలు ఇలాంటి కలుషత మైన నీరు తాగితే అనారోగ్యానికి గురి అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ కట్టలు అనేక చోట కోతకు గురయ్యాయని, కాల్వ కట్టలు మరమ్మతులు

గుంటూరు ఛానల్‌ను పరిశీలిస్తున్న నన్నపనేని శివాజీ

చేయాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా కాలువ మరమ్మతులు తూతు మంత్రంగా జరుగుతున్నాయని విమర్శించారు. కాలువ కట్టల పై జరుగుతున్న పనులను చూసి రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నామమాత్ర చర్యల వల్ల వర్షం పడితే తిరిగి పొలాలకు గండ్లు పడే పరిస్థితి వస్తుంది అన్నారు.ఈ కార్యక్రమంలో కౌవులు రైతు సంఘం నాయకులు సంకూరి నీలాంబరం, రైతులు వి.వీరాంజనేయులు, డి.వినోద్ బాబు,డి. భవానిశంకర్, జి.నాగరాజు, ఎస్.గోపి,డి. సాంబశివరావు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు సమతూకం అడవి బాపిరాజు రచనలు

ప్రజాశక్తి - తెనాలి

సాహిత్యంలో విభిన్న పోకడలకు నాంది పలికిన సాహితీవేత్త అడివి బాపిరాజు అని డాక్టర్ మన్నవ సత్యనారాయణ చెప్పారు. స్థానిక కవిరాజా పార్కులోని విజికె భవన్‌లో ఆదివారం రాత్రి వాకర్స్ క్లబ్ సమావేశం క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 'అడవి బాపిరాజు సాహిత్యం-జీవితం' అంశంపై ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ అడవి బాపిరాజు సాహిత్యంలో సాంప్రదాయాలకు కట్టుబడకుండా, వాటిని వ్యతిరేకించకుండా సమతూకం పాటించేవారన్నారు. ఆయన జైలులో ఉండి రచించిన

డాక్టర్ సత్యనారాయణను సన్మానిస్తున్న సభ్యులు

హిమబిందు నవల ప్రాచుర్యం పొందిందన్నారు. ఈ సందర్భంగా క్లబ్ బఅందం డాక్టర్ సత్యనారాయణ ను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గుత్తా వెంకటరత్నం, లలితానంద ప్రసాద్, కడియాల రవిబాబు, ఆనందయ్య, రంగారావు, నాగమల్లేశ్వరరావు, అబ్బయ్య, మొవ్వ సత్యనారాయణ, నరేంద్ర పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి..

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె ప్రారంభించారు. దీనిలో భాగంగా మంగళగిరిలో మున్సిపల్ కార్యాల యం ఎదుట ఆదివారం సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య, ఎం.బాలాజీ, వి.వి.జవహర్లాల్ మాట్లాడుతూ ఇంజనీ రింగ్ కార్మికుల డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సమ్మెలోకి కార్మికులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచి చెల్లించాలని

సమ్మెలో పాల్గొన్న ఇంజనీరింగ్ కార్మికులు

డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సమ్మె కాలపు ఒప్పదాలకు జీవోలు జారీ చేయాలని అన్నారు. షరతులు లేకుండా సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలకు వెళ్లారని అన్నారు. ప్రజలకు అసౌకర్యం ఏర్పడితే అందుకు బాధ్యత ప్రభుత్వం వహించాల్సి ఉంటుందని అన్నారు. అధికారుల బెదిరింపులతో కార్మికుల సమ్మెలను ఆపలేరని హెచ్చరించారు. వాటర్ వర్క్స్, ఇంజనీరింగ్, కరెంటు రంగాలలో పనిచేసే కార్మికులందరూ పాల్గన్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తాడేపల్లి రూరల్ కార్యదర్శి పల్లె కృష్ణ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, కె.సాంబ శివరావు, ఎస్.నాగరాజు, పి.రాము, కేదార్నాథ్, ఇంతియాజ్, తాడేపల్లి రూరల్ ఫెడరేషన్ అధ్యక్షులు మేకల డేవిడ్ రాజు, కార్యదర్శి సిహెచ్.మరియదాసు, మంగళగిరి రూరల్ ఫెడరేషన్ నాయకులు షేక్ సుభాని, బి.నాగరాజు, కరిముల్లా, షేక్ మహబూబ్ సుభాని తదితరులు పాల్గొన్నారు. కాగా సమ్మెకు మద్దతుగా ఎయిమ్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.శ్రీనివాసరావు, కె.బుజ్జి బాబు పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

222వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సి బకాయిల కోసం చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 222 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను కొర్రపాటి ఆదినారాయణ, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకుడు కె.స్టీవెన్ ప్రారంభించారు, దీక్షల్లో బొందలపాటి నవనీతం, జి.అన్నమ్మ, ఎన్.సుబ్బారావు, ఎం.సాంబశివరావు, దామవరపు నాగేశ్వరావులు కూర్చున్నారు. ఈ సందర్భంగా కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కార్మికులకు నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వై.సాంబశివ రావు, తుపాకుల నాగేశ్వరావు, బి.సూర్యప్రకాశరావు, మల్లె గురవయ్య, బి.దానయ్య, షేక్ సుభాని, స్వర్ణాల వెంకటరమణ పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన కమిటీ

సేవా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నియోజకవర్గం కేంద్రం లోని మహమ్మదీయ ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ హాలు, షాదీ ఖానా అభివృద్ధి సేవా కమిటని ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నూర్ బాషాహుస్సేన్, ఉపాధ్యక్షులుగా పఠాన్ మస్తాన్ వలి, సెక్రెటరీగా షేక్ రజాక్, జాయింట్ సెక్రెటరీగా షేక్ జానీ ట్రెజరీగా, షేక్ మీరాసాహెబ్‌తో పాటు 15 మందిని సభ్యులుగా ఎన్నుకు న్నారు. వీరితో పాటు స్థల దాత కుమారుడు నూతలపాటి త్రిలోక్‌ను గౌరవ సలహాదారుడుగా ఎన్నుకున్నారు. కమిటీ ఏర్పాటు కావడంతో షాదీ ఖానా నిర్మాణా త్వరితగతిన పూర్తవుతుందని పలువురు మైనార్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మ్యాన్‌హోల్స్‌పై మూతలు లేని దృశ్యం

నోళ్లు తెరిచిన మ్యాన్ హోల్స్

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని బైపాస్ రోడ్డు, సిఎస్ఆర్ కళ్యాణమండపం రోడ్‌లో ఏర్పాటుచేసిన మ్యాన్ హోల్స్ నోళ్లు తెరుచుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో నని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కనే ఉండటంతో పిల్లలు అటు పక్కకెళ్తే ప్రమాదం జరుగుతుంద మోనని అపార్ట్మెంట్ వాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు మూతలు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు. మురుగునీరు పొంగిపొర్లి ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా తయారైందని స్థానికులు చెబుతున్నారు. తక్షణమే ఎంటీఎంసీ అధికారులు స్పందించి మ్యానువల్స్ ఏర్పాటు చేయడంతో పాటు చుట్టూ ఉన్న అపరిశుభ్రతను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

జ్వరం, జలుబుకూ తప్పని టెస్టులు

అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న సెంటర్లు

డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వహకులపై కొరవడిన వైద్యశాఖ పర్యవేక్షణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణ, మండల స్థాయిలో పలు ప్రయివేటు ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ (రోగ నిర్ధారణ పరీక్షలు)సెంటర్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ పేరుతో పరీక్షల ఆక్రమాలకు పాల్పడుతున్నారు. సీజనల్ వ్యాధులతో పాటు జ్వరం, జలుబు, దగ్గు ఇతర అనారోగ్య సమస్యలతో ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్ళే రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆవసరం ఉన్నా లేకున్నా పరీక్షలు చేస్తూ రోగుల నుంచి డబ్బు గుంజుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ప్రయివేట్ ఆస్పత్రుల నిర్వహకులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. వైద్యులు లేని సమయంలో ఎవరైనా వైద్యం కోసం వస్తే కింది స్థాయి సిబ్బంది రోగులకు సొంత వైద్యం చేస్తున్నట్లు రోగులు వాపోతున్నారు. అర్హతలేని టెక్నీషియన్లతో పరీక్షలు చేయిస్తూ రోగుల ప్రాణాలతో చెల గాటమాడుతున్నారు. కొంతమంది పరీక్షల అనంతరం రిపోర్డులు ఇవ్వకుండానే సెల్ఫోన్ టెక్స్ట్ ముసేజీని పంపించి అవే రిపోర్టులు అంటూ బిల్లులు వసూలు చేస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల హెచ్చరికలను సైతం పట్టించుకోడం లేదు..పట్టణ, నియోజ కవర్గ స్థాయిలో అధికారికంగా ప్రయివేట్ అస్పత్రులు 35 కాగా, లాబ్స్, డయోగ్నస్టిక్ సెంటర్లు మరో 25 నుంచి 30 వర కు ఉన్నాయని సమాచారం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులున్న ల్యాబ్ సెంటర్లు, అసుపత్రులు మాత్రమే ల్యాబ్ పరీక్షలు చేయాలని స్పష్టమైన ఆదేశాలున్నాయి. ఒక డయాగ్నస్టిడ్ సెంటర్ ఇచ్చిన రిపోర్టుకు, మరో డయాగ్నోసెంటర్ ఇచ్చే రిపోర్టుకు తేడా ఉంటుందోని రోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అనుమతులు లేని డయాగ్నోస్టిక్ సెంటర్లపై తగు చర్యలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రోడ్డు మధ్యలో గుంతలు - తప్పని ఇక్కట్లు

పొలం పక్కనే రహదారిపై నీళ్ల గుంతలు

ప్రజాశక్తి - దుర్గి

మండలంలోని పోలేపల్లి గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో లోతు గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మాచర్ల నుండి దుర్గి వెళ్ళ రహదారి మధ్యలో లోతు గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనం ఆటోల ద్వారా ఆ రహదారి వైపు వెళ్లాలంటే ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎదురుగా వచ్చే ఫోకస్ లైట్ల వెలుగుకు కింద గుంతలు కనపడక ప్రమాదాలు అవుతున్నాయి. రహదారికి అటు, ఇటుఉన్న పొలాలకు నీళ్ల అందించడానికి రైతులు రహదారికి గుంతలు పెట్టి పైపులైన్లు వేశారు. భారీ వాహనాలు ఆ దారిన వెళుతూ ఉండడంతో పైపులైన్లు పగిలిపోయి నీళ్ల రోడ్లపైకి రావడంతో గుంతలు ఏర్పడుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. వర్షాలు పడ్డప్పుడు ఆ లోతు గుంతలు కనపడక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతునానరు. వచ్చేది వర్షాకాలం కావడంతో ఆర్అండ్బి అధికారులు స్పందించి వెంటనే గుంతలు పూడ్చి మరమ్మలు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రజలే బుద్ధి చెబుతారు : యాగంటి

ప్రజాశక్తి - మాచర్ల

మాట్లాడుతున్న యాగంటి మల్లికార్జునరావు

మాజీ మంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి, ప్రసన్న కుమార్ రెడ్డి తమ నోర్లు అదుపులో పెట్టుకోపోతే ప్రజలే బుద్ధిచెబుతారని మార్కెట్యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం యాగంటి మాచర్ల పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి నాయకులు ఒక పథకం ప్రకారం రాష్ట్రంలో గొడవలు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. రాత్రిపూట కన్ను కొడితే చేయాల్సిందంతా చేసేయాలని వైకాపా క్యాడరును రెచ్చగొట్టడం, జగన్మోహన్ రెడ్డి ఎక్కడికి వెళ్ళినా అక్కడ గొడవలు చేయాలని చూడటం వైకాపా నీతిమాలిన రాజకీయానికి నిదర్శనంగా పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైకాపా నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్నారని అన్నారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో జగన్ తన అనుచరులను రెచ్చగొడుతూ ఎక్కడికక్కడ గొడవలు సృష్టించాలని ప్రేరేపిస్తున్నట్లు అర్థమవుతోందని అభిప్రాయపడ్డారు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని విషయం ఇప్పటికైనా జగన్ తెలుసుకోవాలని చెప్పారు. అడ్డగోలుగా మాట్లాడిన నాని, ప్రసన్నకుమార్ రెడ్డి విషయంలో పోలీసు వ్యవస్థ చర్యలు తీసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో మాజీ కౌన్సిలర్ సంతోష్, తిక్కా కొండలు, దుర్భకుల ప్రసాద్, గాజుల ఆంజనేయులు, బాదంబాయి, బొట్టు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కౌలు రైతు బ్రహ్మారెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - విపి సౌత్

కౌలు రైతు బ్రహ్మారెడ్డి ఇంట జరిగిన కడు విషాదకర సంఘటన ఎవరూ పూడ్చలేనిది అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఏడాది కాలంలోనే కౌలు రైతు బ్రహ్మారెడ్డి, ఈ నెల 12న ఆయన భార్య సుబ్బమ్మ మరణాలు తనను ఎంతగానో కలిచివేశాయని అవేదన వ్యక్తం చేశారు. అనాథలుగా మారిన పిల్లలు అఖిల్ రెడ్డి, లక్ష్మీకార్తిక చదువులకు తన వంతు బాధ్యత తీసుకుంటానని పేర్కొన్నారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అప్పుల బాధకు చావుఒక్కటే పరిష్కారం కాదని సూచించారు.

కోట మరణం తీరని లోటు : మా ఏపి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మరణం పట్ల మా ఏపీ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తపరిచింది. ఈ సందర్భంగా స్థానిక మా ఎపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సినీ దర్శకులు దిలీప్ రాజా మాట్లాడుతూ సినిమా రంగం ఓ విలక్షణ నటుడుని కోల్పోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నటనలో ఆయనకున్న డైలాగ్ డిక్షన్ మరెవ్వరికీ లేదన్నారు. వెంకటేష్ హీరోగా నటించిన గణేష్ చిత్రంలోని ఆఖరి సన్నివేశం ప్రేక్షకాదరణ పొందిందన్నారు. కోటలాంటి నటులకు పద్మశ్రీ రాకపోవడం శోచనీయమన్నారు. భారత ప్రభుత్వం ప్రకటించే అవార్డుల్లో కోట శ్రీనివాసరావు పేరును ప్రతిపాదించాలని కోరారు. మా ఏపీ సభ్యులు కారుమూరి శివరామిరెడ్డి ఈదర వెంకట పూర్ణచంద్ రాబర్ట్ కొల్లూరు సామ్రాజ్యం తన్నీరు రమణ చిన్న రాయుడు నివాళిలర్పించారు.

నగదు అందజేస్తున్న వెంకటేశ్వరరావు, ఇతరులు

కౌలు రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని కొచ్చర్ల గ్రామంలో అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న రైతు బండి కొండయ్య కుటుంబాన్ని గుడివాడకు చెందిన అసిస్టెంట్ సబ్రిజిస్ట్రార్ కో-ఆపరేటివ్ సొసైటీ అధికారి ఎన్. వెంకటేశ్వరరావు ఆదివారం పరామర్శించారు.అనంతరం కుటుంబ సభ్యులకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతోపాటు కోటిపల్లి శ్రీనివాస రావు, ఈపూరు పిఎసిఎస్ సభ్యులు అయినాల కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య ఉన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

కమ్యునిటీ కళ్యాణ మండపానికి భూమి పూజ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కమ్యునిటీ కళ్యాణ మండపానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ భూమి పూజ చేశారు. సత్తెనపల్లి మండలం వెన్నా దేవి వావిలాల నగర్లో రెప్కో ఆధ్వర్యంలో రూ.కోటి 32 లక్షల 50వేలతో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీ కళ్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రెప్కో బ్యాంకు ఆద్వర్యంలో 61 మంది ఒంటరి మహిళలకు స్వయం ఉపాధి కోసం ఉచిత కుట్టుమిషన్లు, విద్యార్థులకు ఉపాకార వేతనాలు పంపిణీ చేశారు. ఇద్దరు పిల్లలను బ్యాంకు అధికారులు దత్తత తీసుకున్నారు. బ్యాంకు చైర్మన్ సి సంధా నం వైస్ చైర్మన్ గంగరాజు, టిడిపి నాయకులు సోలనంబీ, దరువూరి నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యానికి కళలే ఆయుధం

ప్రజాశక్తి - తెనాలి

ప్రజా చైతన్యంలో కళలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని ఏపీ ప్రజానాట్యమండలి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ రామకృష్ణ అన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలు జరుపుకునే క్రమంలోనే 28వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 23, 24, 25 తేదీలలో ఒంగోలులో జరుగుతున్న సందర్భంగా వివిధ ప్రదర్శనలలో వెయ్యి మంది కళాకారులు పాల్గొంటారని చెప్పారు. ఈ ప్రదర్శనలో కోలాటం, డప్పులు, నృత్యం, దింసా నత్యం, తప్పెటగుళ్ళు, బుర్రకథ దళాలు పాల్గొంటారని, జిల్లా నుంచి కూడా అధిక సంఖ్యలో కళారూపాలతో కళాకారులు పాల్గొనాలని అన్నారు. బొల్లిముంత కష్ణ మాట్లాడుతూ కళాకారులకు తెనాలి పుట్టిల్లు అన్నారు. సమన్వయకర్త కనపర్తి బెన్హర్ మాట్లాడుతూ పోస్టర్ నాటికతో ఒంగోలులో జరిగే కళా ప్రదర్శనలో పాల్గొంటామని చెప్పారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, నీలాంబరం, మల్లికార్జునరావు, దేవరకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్

ప్రజాశక్తి - పెదకూరపాడు

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక గ్రీవెన్స్ యధావిధిగా జరుగుతుందని తహశీల్దార్ ఎన్ ధనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీవెన్స్లో మండలంలోని అధికారులందరూ హాజరవుతారని ఆమె వివరించారు. ఏమైనా సమస్యలను వారు రాతపూర్వకంగా ఇవ్వాలని తెలిపారు.

పిహెచ్సిలో మహిళా డాక్టర్ నియమించండి

ప్రజాశక్తి- రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా డాక్టర్ని నియమించాలని టిడిపి నేతలు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో ఇక్కడ పనిచేసిన డాక్టర్ వై.హేమ చిత్తూరు జిల్లా నిడగుర్తికి బదిలీ అయ్యారు. అప్పటినుంచి ఖాళీగా ఉందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. 24 గంటల ఆసుపత్రిగా రూపాంతరం చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా రోగులు ఎక్కువమంది వస్తున్నారని ఓపి అధికంగా ఉంటుందని తెలిపారు.

ఆగస్టు 15 లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించండి

ప్రజాశక్తి - రెంటచింతల

ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో చేరేందుకు రైతులు తమ ప్రీమియం చెల్లించాలని వ్యవసాయాధికారి కట్టా లక్ష్మారెడ్డి కోరారు. వరి, పత్తి రైతులు ఆగస్టు15వ తేదీలోపు, మినుము రైతులు జూలై 31 లోపు చెల్లించాలని వారు కోరారు.

పులిచింతలకు 8700 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని సత్రశాల వద్ద కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్లు ద్వారా శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1ఎం యు (మిలియన్ యూనిట్) విద్యుత్ తయారైనట్లు ఎస్ఇ వెంకటరమణ తెలిపారు. రేడియల్ క్రస్ట్ గేట్లు అన్ని మూసివేసామన్నారు. టైల్ రైస్ ఛానల్ ద్వారా విద్యుత్తు అనంతరం పులిచింతలకు 8700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. రిజర్వాయర్లో 6.711 టిఎంసిల నీరు ఉండగా ఈ నీరు 245.93 అడుగులకు సమానమన్నారు.

నాలుగేళ్లుగా హాస్టల్ నిర్మాణం

ప్రజాశక్తి - రెంటచింతల

రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో ఉన్న మోడల్ స్కూలులో వసతులు కరువయ్యాయి. హై స్కూల్ ప్రాంగణమంతా రాళ్ళ,రప్పలతో నిండి ఉండటంతో ఆటలాడుకోవటానికి బాలబాలికలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా నాలుగేళ్లుగా బాలికల హాస్టల్ భవన నిర్మాణం కొనసాగుతూనే ఉంది. ఎప్పటికీ పూర్తవుతుందో ఎవరికీ అంతుబట్టకుండా ఉంది. ఈ భవన నిర్మాణం కోసం సమగ్ర శిక్ష ద్వారా రూ.1.90 కోట్లు కేటాయించారు. హాస్టల్ వాడుకలోకి వస్తే వందమంది బాలికలకు వసతి కల్పించడంతో పాటు చదువుకునే వారి సంఖ్య కూడా పెరుగుతుంది. 2012లో ఈ స్కూలు రూ.3.2 కోట్లతో నిర్మించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మ నందరెడ్డి హాస్టల్ నిర్మాణం పూర్తయ్యే విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు

సాగరమాత దేవాలయంలో సందడి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సాగరమాత పుణ్యక్షేత్రానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. సాగరమాత ఆలయం మతసామరస్యానికి ప్రతీక. ఉదయం కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి ముందు దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షణ నిర్వహించారు. అనంతరం జపమాల క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమరావతి సామాజిక పింఛను పునరుద్ధరణ

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఆశాలు,అంగన్ వాడీ లు,హైకోర్టు, సచివాలయంలో పనిచేస్తున్న కార్మికులకు నిలిపివేసిన అమరావతి సామాజిక ఫెన్షన్ ను ప్రభుత్వం పునరుద్ధరించింది.ఈ మేరకు ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంది.సుమారు 1400 మందికి ఫెన్షన్ పునరుద్ధరించినట్లు సమాచారం.రాజధానిలో భూమిలేని పేదలకు టిడిపి ప్రభుత్వం 2014-19 లో నెలవారీ అమరావతి సామాజిక ఫెన్షన్ ను రూ 2,500 చొప్పున అందజేసింది.ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం పారిశుధ్ధ్య కార్మికులు, ఆశాలు, అంగన్ వాడీలు,హైకోర్టు, సచివాలయంలో పనిచేసే కార్మికులను ఉద్యోగులంటూ ఫెన్షన్ తీసివేసింది.2024 ఎన్నికల ముందు హడావిడిగా ఫెన్షన్ ను రూ 2,500 ల నుంచి రూ 5 వేలకు పెంచింది తప్ప నిలిపివేసిన ఫెన్షన్ ను మాత్రం పునరుద్ధ రించలేదు. దీంతో ఫెన్షన్ రాక, జీతం సరిపోక కార్మికులు ఆర్ధికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ,రాజధాని ఏరియా పారిశుధ్య కమిటీ ఫెన్షన్ పునరుద్ధరణ కోసం దశల వారీగా పోరాటాలు నిర్వహించింది.సిఐటియు అధ్యక్ష,కార్యదర్శి ఎం రవి,ఎం భాగ్యరాజు ఆధ్వర్యంలో కార్మికులు ప్రజాప్రతినిధులు,సి ఆర్ డి ఎ ఉన్నతాధికారులకు అర్జీలు అందజేశారు.ఆందోళనలు చేపట్టారు.స్థానిక ఎమ్మెల్యే కూడా సానుకూలంగా స్పందించడంతో ప్రభుత్వం ఎట్టకేలకు ఫెన్షన్ పునరుద్ధరణ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ఆగస్టు 1 నుంచి కార్మికులకు ఫెన్షన్ అందిస్తారని సమాచారం.

పారిశుధ్యం నిర్వహణ ప్రణాళికాబద్ధంగా ఉండాలి

పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ ప్రణాళికా బద్ధంగా ఉండాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. పట్టణంలోని పలు వార్డులలో ఆదివారం ఉదయం ఆయన పర్యటించి చెత్త సేకరణ, కాలువల పూడికతీత పనులను పరిశీలించారు. శానిటరీ డివిజన్ కార్యాలయాల వద్ద కార్మికుల హాజరు శాతం, రికార్డులను తనిఖీ చేశారు. పలుచోట్ల పారిశుధ్యం అధ్వానంగా ఉండటంపై ఆయన కార్మికులతో మాట్లాడారు. పనిలో జాప్యం ఎందుకు జరుగుతుంది, పారిశుధ్యం మెరుగుపడక పోవటానికి గల కారణాలను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 వరకు అంటే రెండు దఫాలు శాసనసభ్యుడిగా తాను పని చేసిన కాలంలో తెనాలిలో పారిశుధ్య నిర్వహణ తీరును విశ్లేషించారు. ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఇంటింటి చెత్త సేకరణలో, వ్యాపార కూడళ్లలో చెత్త సేకరించే విధానాలలో మార్పు రావాలని సూచించారు. దానికి ప్రణాళిక ప్రకారం పని చేయాలని కమిషనర్ వి.లక్ష్మీపతిరావు, ఎంహెచ్ఓ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. కౌన్సిల్ సమావేశానికి ముందు శానిటరీ డివిజన్ల వారీగా పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాల్సిన అవసరతలపై చర్చించాల్సి ఉందన్నారు. ఆయన వెంట కమిషనర్ వి.లక్ష్మీపతిరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ డి శ్రీనివాసరావు, పలువురు సిబ్బంది ఉన్నారు.

గుండిమెడలో సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం

ఇంటింటి ప్రచారంలో టిడిపి నాయకులు కొమ్మారెడ్డి కిరణ్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం తన పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని టీడీపీ తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ అన్నారు.ఆదివారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని గుండిమెడలో మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టీడీపీ తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కొమ్మారెడ్డి కిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరిం చడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న 'సూపర్ 6'హామీల పురోగతిని ప్రజలకు వివరించినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు, కీలక ప్రాజెక్టుల వివరాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కేవలం ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడమే కాకుండా, ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు కూడా స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల అమలులో వివక్షను ఎదుర్కొన్నామని, కానీ ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో 'సూపర్ 6' పథకాలు ఎలాంటి పక్షపాతం లేకుండా అందరికీ సమానంగా అందుతున్నాయని ప్రజలు చెప్పారన్నారు. నాయకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గుండిమెడ గ్రామ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బా రావు, ప్రధాన కార్యదర్శి నామాతోటి రాంబాబు, అనుమోలు వీరాంజనేయ ప్రసాద్, సాంబశివరావు, కె.అంకినేయుడు, ఎం.బాబురావు, కె. కుమార్, జె.సతీష్, పి.భార్గవ్,కె. నరసింహరావు, కె. శ్రీను, బి. సంతోష, జెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దళిత ఓపెన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండల కేంద్రమైన ఫిరంగిపురంలోని దీనాపూర్ కళాశాల వార్షికోత్సవం, రంజన్ బాబు జన్మదిన వేడుకలు కార్డ్స్ సంస్థ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి కృపాచారి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాలలో నిపుణులైన విద్యావేత్తలు రచయితలు సంఘ, సామాజిక సేవకులు జిహెచ్ విక్టర్ జోసఫ్, డి రమేష్, ఏ వెంకటరత్నం, కేమణి సింగ్, ఆర్ బాబిని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దళిత్ ఓపెన్ యూనివర్సిటీ జాతీయ పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో దళిత్ ఓపెన్ యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ స్వర్ణలతా దేవి కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ టిఅమర్నాథ్ డైరెక్టర్ కె మేరీ, ఆర్‌సిజెసిపి ప్రిన్సిపాల్ పి సుదర్శన్, లెక్చరర్ ఎం నాగేశ్వరావు, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి - పెదనందిపాడు

సర్టిఫికెట్లు అందుకున్న వారితో రాజమోహన్రావు తదితరులు

కామ్రేడ్ కొల్లా వెంకయ్య మెమోరియల్ గ్రంథాలయం పెదనందిపాడు నందు ఉచిత కంప్యూటర్ నేర్చుకున్న మూడవ, నాలుగవ బ్యాచ్ మహిళలు, విద్యార్థులు 18 మందికి ఆదివారం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్టిఫికెట్లు అందజేశారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ కొల్లా రాజమోహన్రావు, డాక్టర్ అనిత, ఎం జవహర్ రాణి హాజరయ్యారు. రాజమోహన్రావు మాట్లాడుతూ కొల్లా వెంకయ్య మెమోరియల్ గ్రంథాలయం ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులు ఆరు నెలల నుంచి విజయవంతంగా జరుగుతున్నాయని తెలియజేశారు. ఈరోజు శిక్షణ పూర్తి చేసుకున్న 18 మంది మహిళలకు, విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేసినట్లు తెలిపారు. మహిళలు ఆర్థిక స్వావలంబన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ టీచర్ ఎస్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు గేరా మోహన్ రావు, గ్రామ పెద్దలు కొల్లా వెంకయ్య చౌదరి, బోడావుల హనుమంతరావు, లావు చౌడేశ్వరి, ఈదర భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి తులాభారం బహూకరణ

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని శివాలయానికి గ్రామనికి చెందిన శివకోటి సాంబశివరావు,రోజా దంపతులు శివకోటి రామారావు భార్య పద్మావతి జ్ఞాపకారం దేవస్థానానికి రూ.40 వేలు విలువచేసే స్టీల్ తులా భారం (కాటా) సమర్పించినట్లు ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్ తెలిపారు. ఆలయ అభి వృద్ధికి, నిత్యాన్నదాన పథకానికి సహకరించాలని లీలకుమార్ విజ్ఞప్తి చేశారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన టిడిపి నాయకులు

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి బాపనయ్య నగర్, మున్సిపల్ పాఠశాలలో మంత్రినారా లోకేష్ స్ఫూర్తితో పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన అమరావతి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టీడీపీ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, పార్టీ పట్టణ అధ్యక్షులు పడవల మహేష్ హాజరయ్యారు. శిబిరాన్ని ట్రస్ట్‌బోర్డు సభ్యులు జానకి దేవి ప్రారంభించారు. అనంతరం పోతినేని మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ పార్టీ అధికారంలో లేని సమయంలో తమ సొంత నిధులతో నియోజకవర్గంలో ఉచిత వైద్య శిబిరాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. టీటీడీ ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు జానకి దేవి మాట్లాడుతూ కష్టపడి పని చేసుకుంటూ బయటికి వెళ్లి వైద్యం చేయించుకోలేని ఈ ప్రాంత ప్రజలు అమరావతి కంటిఆసుపత్రి ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మాజీ కౌన్సిలర్ దిడ్ల సత్యానందం, టీడీపీ నాయకులు తురక వీరశేఖర్, తోట కరుణ కుమార్ యాదవ్, కోలా శ్రీనివాసరావు, పసుపులేటి సదాశివరావు, ముత్తయ్య, గాజుల క్రాంతి, తెలుగు మహిళా నాయకురాలు షేక్‌రజియాబేగం, సింహాచలం పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎక్స్‌గ్రేషియా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పెదకాకానిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండలంలోని పలువురికి ప్రభుత్వం తరపున చెక్కులను పంపిణీ చేశారు. గత సంవత్సరం లూధర్ గిరిలో ప్రహరీ కూలి మరణించిన చిన్నారులు బంగారు సిద్ధార్థ (12), కోలాటపు సాత్విక్(12) తల్లులకు ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందచేశారు. ఈ సంవత్సరం నంబూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన దాసరి జాషువా (12) ప్రమాదవశాత్తు కాలుజారి కాల్వలో పడి మరణించాడు. వారి కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా చెక్కును అందించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలల్లోనూ కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తోందని మెరుగైన వైద్య నిమిత్తం వివిధ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందిన బాధితులకు వారు చెల్లించిన నగదు రశీదులను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే విచారించిన అనంతరంముఖ్యమంత్రి సహాయ నిధిని అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతోపాటు మెరుగైన సమాజాన్ని అందించాలనే ఆలోచనా విధానంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారనీ, ఆయన సేవలు రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలిచ్చి ప్రజలకు వెన్నుపోటు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ హనుమంతరావు

ప్రజాశక్తి - మంగళగిరి

ఎన్నికల్లో టిడిపి కూటమి అబద్దపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి వెన్నుపోటు పొడిచిందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్‌ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ డి వేమారెడ్డి అన్నారు. ఆదివారం మంగళగిరి వైఎస్ఆర్సిపి నియోజకవర్గ కార్యాలయంలో వైయస్సార్సీపి రూరల్ పార్టీ అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ఇదే చంద్రబాబు అమలు సాధ్యం కాని హామీలను ప్రకటించి గద్దె నెక్కగా, 2019 ఎన్నికల్లో ప్రజలు గద్దె దించారన్నారు. గతంలో చేసిన పొరపాట్లు మళ్లీ చేయరనే ఉద్దేశంతో ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే, పాత తరహాలో కూటమి ప్రభుత్వం నమ్మించి మోసగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు తమ నిరంకుశ, అరాచక విధానాలను పరిచయం చేసిందన్నారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు నియోజకవర్గ మండల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీ లావణ్య

సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యం ఫిజియోథెరపి

ప్రజాశక్తి-గుంటూరు

సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యం ఫిజియోథెరపి అని సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ లక్ష్మీ లావణ్య అన్నారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నొప్పుల నివారణలో ఫిజియోథెరపి పాత్ర అనే అంశంపై నిర్వహించిన ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ లక్ష్మీ లావణ్య మాట్లాడుతూ ఫిజియోథెరపి ఒక శారీరక చికిత్స మాత్రమేనని, ఇందులో ఎలాంటి మందుల ప్రమేయం ఉండదని, ఏదేని అనారోగ్యంగానీ, గాయం తరువాత శరీరం తిరిగి మామూలుగా అయి రోగి తన విధులను సక్రమంగా చేసుకొనేలా చేయగలిగేది ఫిజియోథెరపి తెలిపారు. నాడీ వ్యవస్థ లోపాలు, కండరాల లోపాలు, శ్వాసకోశ రుగ్మతలు, గుండె సంబంధిత వ్యాధి తదితర సమస్యలు ఉన్నప్పుడు ఫిజియోథెరపి బాగా పనిచేస్తుందని చెప్పారు. ఈ వైద్యం ద్వారా దీర్ఘకాలిక సమస్యలైన స్పాండిలైటిస్, ఫ్రోజెన్ షోల్డర్, టెన్నిస్ ఎల్బో తదితర ఇబ్బందుల నుండి ఉపశమనం పొందవచ్చున్నారు. పక్షవాతం, మెడనొప్పి, నడుము నొప్పి, మోకాళ్ళ నొప్పి, భుజం నొప్పి, వెన్ను సమస్యకు సంబంధించి శస్త్ర చికిత్సకు ముందు తరువాత వాటి పని తీరుని పునరుద్ధరించడానికి, రీ-హ్యాబిలిటేషన్‌కు ఫిజియోథెరపి ఉపయోగపడు తుందన్నారు. మహిళల జీవితంలో అత్యంత కీలకమైన గర్భధారణ, ప్రసవం, రుతుక్రమం వంటి సందర్భాల్లో వచ్చే సమస్యలను కొంతవరకు ముందు జాగ్రత్తతో ఫిజియోథెరపి ద్వారా అధిగమించవచ్చున్నారు. ఫిజియోథెరపీలో చిరో ప్రాక్టీక్ సర్దుబాటు ప్రక్రియ అందుబాటులోకి వచ్చిందని, దిగువ వెన్నునొప్పి, మెడ నొప్పి, తలనొప్పులు లాంటి వాటికి చిరో ప్రాక్టర్స్ ప్రత్యామ్నాయ చికిత్సా పద్ధతుల ద్వారా మెరుగైన వైద్యం అందజేస్తున్నారన్నారు. అదేవిధంగా కైరో ప్రాక్టీక్ చికిత్సా విధానం అందుబాటులోకి వచ్చిందని, శరీరంలోని జాయింట్స్ సరిగ్గా పని చేయకపోయినా, నొప్పి, అలసట మరియు నిద్రలేని రాత్రులు ఇబ్బందులు పెడుతున్నా కైరో ప్రాక్టిక్ చికిత్స ద్వారా శరీరాన్ని సహజ స్థితికి తీసుకొస్తారన్నారు. సభలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, అనవేమా ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి, యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్, డాక్టర్ రవీంద్ర కుమార్‌లు పాల్గొన్నారు.

వేగంగా అభివృద్ధి పనులు

మేయర్ కోవెలమూడి రవీంద్ర

ప్రజాశక్తి-గుంటూరు

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నగరంలో అభివద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. ఆదివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 42వ డివిజన్, నవభారత్ నగర్‌లో రూ.53 లక్షలతో సిసి డ్రెయిన్ల నిర్మాణానికి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రజావసరాలను దష్టిలో పెట్టుకొని స్థానిక శాసనసభ్యులు పలు అభివృద్ధి పనులు చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. వార్డుల వారీగా మౌలిక వసతుల కల్పనలో స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకొని అభివద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా పనులు చేపడుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యే మాదవి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, వారి అవసరాలను దష్టిలో ఉంచుకొని అభివద్ధి పనులు చేస్తున్నామన్నారు.త్రాగు నీటి సమస్య లేకుండా ఎప్పటికప్పడు చర్యలు తీసుకున్నామని, ప్రధానంగా నగరంలో పారిశుధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, నగరంలో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. గుత్తేదారులు నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పోరేటర్లు వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్, ఈరంటి వరప్రసాద్, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు ప్రణాళికలు సిద్ధం..

సరిపడా విత్తనాలు ఎరువులు - ఎరువుల వినియోగం తగ్గించాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ఖరీఫ్ సాగుకు సంబంధించి ప్రణాళికలు తయారుచేశామని పూర్తి స్థాయిలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం. జగ్గారావు అన్నారు. రైతులు అధిక దిగుబడులు కోసం మితిమీరిన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా భూమి సారాన్ని పెంచే సేంద్రియ, పచ్చిరొట్ట, పశువుల ఎరువులు వినియోగించాలన్నారు. ఈమేరకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. నకిలీ బయో పురుగు మందులు, విత్తనాలు, ఎరువులు అరికట్టేందుకు పోలీస్, రెవిన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో కషి చేస్తున్నామన్నారు. రైతులు ఎరువుల వినియోగం తగ్గించాలని తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు సాధించాలని సూచించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మరిన్ని వివరాలు వెల్లడించారు.

ఖరీఫ్‌లో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారు?

పల్నాడు జిల్లాలో 4.25 లక్షల ఎకరాలలో పంటలు సాగయ్యే అవకాశం ఉంది. 2.30 లక్షల ఎకరాలలో ప్రత్తి సాగు చేస్తారని అంచనాలు ఉండగా ఇప్పటి వరకు 28 వేల ఎకరాలలో సాగు చేశారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ జలాశయంలో నీటి లభ్యత ఆశాజనకంగా ఉండడంతో వరి సాగు వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. 1 లక్ష ఎకరాలలో వరి, 50 వేల ఎకరాలలో కంది, మరో 50 వేల ఎకరాలలో ఇతర అపరాల పంటలు సాగయ్యే అవకాశం ఉంది.

ఎరువుల వినియోగం తగ్గించేలా అవగాహన?

ఎరువుల వినియోగంలో రాష్ట్రంలో పల్నాడు జిల్లా 2వ స్థానంలో ఉంది. మితిమీరి ఎరువుల వాడకం వలన పెట్టుబడులు పెరగడంతో అనేక అనర్థాలు ఏర్పడుతున్నాయి. నేల సారం కోల్పోవడంతో పాటు ఉత్పత్తులు విషతుల్యమవుతాయి. పచ్చిరొట్ట సేంద్రియ ఎరువుల వినియోగం వలన పెట్టుబడులు తగ్గడంతో పాటు నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు సాధించవచ్చున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా 4500 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై సరఫరా చేయడం జరిగింది. పచ్చిరొట్ట ఎరువుల ఆవశ్యకత వివరించి ఆ దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నాం. 3.52 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా 67 వేల టన్నులు సిద్ధం చేశాం.

డ్రోన్లు రాయితీతో ఏ పద్ధతిలో ఇస్తారు?

5 గురు రైతులు బందంగా రూ 5 లక్షలు బ్యాంకుకు చెల్లిస్తే మరో రూ 5 లక్షలు ఋణం పొంది డ్రోన్ పొందితే 80 శాతం లభిస్తుంది. బందంగా ఏర్పడిన రైతులు రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి. 5 గురు రైతులలో ఇద్దరు రైతులు కనీసం ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలి. వారికి లాంఫామ్ నందు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

జిల్లాలో ఎన్ని డ్రోన్లు పంపిణీ చేశారు?

43 బృందాలు దరఖాస్తు చేసుకోగా 36 బందాలకు ఇప్పటికే బ్యాంక్ కు రూ 5 లక్షలు చెల్లించి అర్హులుగా ఉన్నారు. 7 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. డ్రోన్ల వినియోగంతో కూలీల కొరత అధిగమించడంతో పాటు ఒక రోజు పదుల సంఖ్యలో కూలీలు చేయాల్సిన పనిని కొన్ని గంటలలో పూర్తి చేయొచ్చు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లక్ష్యం?

67 వేలు కౌలు రైతు గుర్తింపు కార్డులు లక్ష్యం కాగా 12 వేల కార్డులు మంజూరు చేశాం. కౌలు రైతు గుర్తింపు కార్డు పొందిన వారికి అన్నదాత సఖీభవ,ఇ-క్రాప్ నమోదు, ప్రభుత్వ మద్దతు ధరకు పంటల కొనుగోలు మరికొన్ని ఇతర సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుంది. గత ఏడాది జేజిఎల్ 384 రకం కోసం రైతులు ఇబ్బందులు పడ్డారు?ఈ ఏడాది ఏ విధంగా చర్యలు చేపట్టారు? గత ఏడాది జేజిఎల్ 384 రకం వరి విత్తనాలు సరిపడా ఉన్నప్పటికీ వ్యాపారులు కత్రిమ కొరత సష్టించారు. ఏపి సీడ్స్ విత్తన విక్రయ కేంద్రంలో జేజిఎల్ 384 రకం 2 వేల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి.

సిపిఎం నాయకుడిపై దాడి హేయం...

- **దాడికి పాల్పడిన టిడిపి నాయకులు మొఘల్ జాన్, సమీర్‌లను అరెస్ట్ చేయాలి**
- **బంగారం పోగొట్టుకున్న బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం**
- **సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్**

కరపత్రం ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

క్రోసూరు మండలం దొడ్లేరు గోదావరి చైతన్య గ్రామీణ బ్యాంకులో బంగారం పోగొట్టుకున్న బాధిత రైతుల పక్షాన పోరాటం చేస్తున్న సిపిఎం నాయకులు తిమ్మిశెట్టి హనుమంతరావుపై దాడికి పాల్పడిన టిడిపి నాయకు(బంగారం వ్యాపారులు)లను తక్షణమే అరెస్ట్ చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులో సిపిఎం కార్యాలయంలో ఆదివారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. టిడిపి నాయకులు వైఖరి, పోలీసుల తీరు ఖండిస్తూ కరపత్రం ఆవిష్కరించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ పీడిత వర్గ ప్రజల పక్షాన నిలిచి నిస్వార్థంగా పోరాటాలు చేస్తున్న సిపిఎం నాయకులపై అధికార పార్టీ వర్గీయులు దాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు.టిడిపికి చిత్తశుద్ధి ఉంటే మొఘల్ జాన్ ను మండల అధ్యక్ష స్థానం నుంచి తప్పించి పార్టీ నుండి సస్పెండ్ చేయాలన్నారు. రైతులు తనఖా పెట్టిన బంగారం గోల్ మాల్ కావడంలో అప్రైజర్ నాగార్జునతో దాడికి పాల్పడిన టిడిపి నాయకుల హస్తం ఉందని అందుకే పోరాటాన్ని నీరుగార్చేందుకు దాడికి పాల్పడ్డారన్నారు. దీనిపై సిపిఎం 2 ఏళ్ల పోరాటం ఫలితంగా 400 మంది బాధితులకు న్యాయం జరిగిందని మిగిలిన 140 బాధితులకు న్యాయం చేయాలని పోరాటం చేస్తున్న క్రమంలో టిడిపి నాయకులు దాడికి పాల్పడడం పోలీసులు వారికే వత్తాసు పలకడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.ఈ నెల 10 న బ్యాంక్ కు తాళం వేసి పురుగుమందు డబ్బాలతో ఆందోళనకు దిగగా డి.ఎస్.పి వచ్చి మాట్లాడతారని ఆందోళన విరమించాలని ఎస్.ఐ రవి కుమార్ చెప్పడంతో ఆందోళన విరమించారన్నారు. ఆందోళనలో కీలకంగా వ్యవహరించిన తిమ్మిశెట్టి హనుమంతరావుపై అదేరోజు టిడిపి మండల అధ్యక్షులు మొఘల్ జాన్, సోదరుడు సమీర్ లు దారి కాచి దాడికి పాల్పడగా దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, పోలీసులు అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. క్రోసూరు మండలంలోని పేద ప్రజలు,రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు అధికారుల దష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి హనుమంతరావు కృషి చేయడాన్ని అధికార పార్టీ నాయకులు ఓర్వలేక పోతున్నారన్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని బాధితునికి రక్షణ కల్పించాలని లేని పక్షంలో ఆందోళన చేపడతా మన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు పీడిత వర్గ ప్రజల రక్షణకు సిపిఎం పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో బాధిత నాయకుడు తిమ్మిశెట్టి హనుమంతరావు, సిపిఎం నాయకులు డి శివకుమారి, జి.మల్లీశ్వరి, జి.ఉమశ్రీ, సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, నాయకులు ఏపూరి గోపాలరావు, పెద్దిరాజు, తెలకపల్లి శీను, హరి పోతురాజు, బాలకష్ణ, సిలార్ మసూద్,పి వెంకటేశ్వర్లు, లక్ష్మీశ్వర రెడ్డి, హరిపోతురాజు, రాధాకష్ణ, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

సన్ సేవాదృక్పథం అభినందనీయం

సన్ సభ్యులతో కె.ఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సేవాభావంతో పేద విద్యార్థులను, అనాథ పిల్లలను, అంగ వైకల్యంతో విద్యను అభ్యసిస్తున్న, ప్రతిభ గల విద్యార్థులకు తోడ్పాటు అందించడానికి స్టూడెంట్స్ యూనియన్ ఫర్ ఇండియా (సన్) చేస్తున్న కషి అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం హాలులో సన్ సంస్థ 12వ వార్షికోత్సవం సన్ సంస్థ వ్యవస్థాపకులు యశ్వంత్ నేతత్వంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ 2013లో ప్రారంభమైన సన్ సంస్థ గత 12 సంవత్సరాలుగా గుంటూరు జిల్లాలో ప్రతిభ గల వందలాది పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ ఇస్తూ చేయూత అందిస్తుందన్నారు. విద్యార్థి దశలోనే యశ్వంత్, సాయి, ఆదిశేషు లాంటి విద్యార్థులు ముందుకు వచ్చి సన్ సంస్థను స్థాపించి విద్యార్థి లోకానికి ఆదర్శంగా నిలిచారన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అట్టడుగున 36వ స్థానంలో ఉండటం దురదష్టకమన్నారు. సన్ లాంటి సంస్థలు అనేకం ఏర్పడి ఆంధ్రప్రదేశ్ ను అక్షరాంధ్రగా మార్చాలని కోరారు. గుంటూరు నగరంలో నేస్తం, మానవత, కోవిడ్ ఫైటర్స్, రుద్రా చారిటబుల్ ట్రస్ట్, అమ్మ చారిటబుల్ ట్రస్ట్, కార్మెల్ సేవా సదన్, అభినందన ఫౌండేషన్ లాంటి సంస్థలు బహుముఖ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు. సన్ సంస్థ వ్యవస్థాపకులు యశ్వంత్ ప్రసంగిస్తూ పేద విద్యార్థులకు రూ.5 లక్షల రూపాయల స్కాలర్ షిప్‌లను 12వ వార్షికోత్సవ సందర్భంగా అందిస్తున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హిందూ ఇంజినీరింగ్ కాలేజి సెక్రటరీ సిహెచ్.రామకష్ణమూర్తి, నేస్తం వ్యవస్థాపకులు జలీల్ అహ్మద్, అపెక్స్ వ్యవస్థాపకులు కె.నాగేశ్వరరావు, సీనియర్ సాఫ్ట్వేర్ ఇంజనీర్ దిలీప్, జనవిజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ ఎ.సత్యనారాయణప్రసాద్, సామాజిక విశ్లేషకులు టి. ధనుంజయ రెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం 25 మంది ప్రతిభ గల విద్యార్థులకు రూ.5 లక్షల స్కాలర్ షిప్‌లను అందించారు.